క్లుప్తంగా

నేడు ప్రముఖ వైద్య నిపుణులు రాక

– ఉచిత షుగర్ పరీక్షలు

పులివెందుల : పట్టణంలోని స్థానిక భాకరాపురంలో ఉన్న దినేష్ మెడికల్ సెంటర్(గంగిరెడ్డి ఆసుపత్రి)లో ఆదివారం ప్రముఖ వైద్య నిపుణులు రానున్నట్లు ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ప్రముఖ న్యూరో సర్జన్ డాక్టర్ క్రాంతి కుమార్ మెదడు, వెన్నెముక, నరాలు, తిమ్మిర్లు, వంటి, ఒళ్లు నొప్పులకు వైద్య చికిత్సలు అందిస్తారన్నారు. అలాగే కర్నూలు విశ్వభారతి ఆసుపత్రి నుంచి ప్రముఖ గుండె జబ్బుల వైద్య నిపుణులు డాక్టర్ హితేష్‌రెడ్డి గుండె జబ్బుల సంబంధిత వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహిస్తారన్నారు. ప్రముఖ షుగర్ స్పెషలిస్ట్ డాక్టర్ వై.జి.హర్షవర్ధన్‌రెడ్డి ఉచితంగా షుగర్ పరీక్షలు నిర్వహిస్తారన్నారు. షుగర్ పరీక్షలు చేయించుకోవాలనుకునేవారు పరగడుపున ఏమి తినకుండా రావాలన్నారు. ఈ అవకాశాన్ని పులివెందుల ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు 9963170177, 08568286189 అనే ఫోన్ నెంబర్లకు సంప్రదించాలన్నారు.

26 నుంచి ఆడుదాం ఆంధ్రా క్రికెట్ పోటీలు

లింగాల : ఆడుదాం.. ఆంధ్రా ఆటల పోటీలు ఈనెల 26వ తేదీ నుంచి నిర్వహించనున్నామని ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఈనెల 26, 27, 28వ తేదీలలో మండల కేంద్రమైన లింగాల పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న క్రీడా మైదానంలో క్రికెట్ పోటీలను నిర్వహిస్తున్నామని.. మండలంలోని అన్ని సచివాలయాల పరిధిలోని గ్రామాల క్రికెట్ జట్లు హాజరు కావాలన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ రమాదేవి, జెడ్పీటీసీ పుష్ప, వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొంటారని తెలిపారు.

నేడు వికసిత భారత్ సంకల్పయాత్ర

లింగాల : మండలంలోని వెలిదండ్ల గ్రామంలో ఈనెల 24వ తేదీన ఆదివారం వికసిత భారత్ సంకల్ప యాత్ర నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ సురేంద్రనాథ్ తెలిపారు. ఈ యాత్రకు ప్రజాప్రతినిధులు, మండలస్థాయి అధికారులు, సచివాలయ సిబ్బంది తమకు సంబంధించిన పూర్తి నివేదికలతో హాజరు కావాలన్నారు.

శ్రీకాశిరెడ్డి నాయన ఉత్సవ విగ్రహం ఊరేగింపు

లింగాల : వనంబావి శివాలయం వద్ద వెలసిన శ్రీకాశిరెడ్డి నాయన ఆలయంలో ఈనెల 26వ తేదీన ఆరాధనోత్సవం నిర్వహించనున్నారు. ఇందులో భాగంగా శ్రీకాశిరెడ్డి నాయన నూతన కాంస్య ఉత్స విగ్రహంతోపాటు కాంస్య ముఖ ద్వారాన్ని తయారు చేయించి శనివారం తీసుకొచ్చారు. ఈ సందర్భంగా శ్రీకాశిరెడ్డి నాయన కాంస్య విగ్రహాన్ని డప్పు వాయిద్యాలతో గ్రామంలో ఊరేగింపు నిర్వహించారు. ముఖ ద్వారాన్ని ఎం.పుల్లారెడ్డి తయారు చేయించగా.. కాశిరెడ్డినాయన ఉత్సవ విగ్రహాన్ని గ్రామస్తుల సహాయ సహకారాలతో తయారు చేయించడం జరిగిందని నిర్వాహకులు తెలిపారు.

విద్యార్థులకు స్టడీ చైర్స్ వితరణ



విద్యార్థులకు స్టడీ చైర్స్‌ను అందిస్తున్న నాగిరెడ్డి కుటుంబ సభ్యులు

తొండూరు : మండలంలోని సంతకొవ్వూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులకు శనివారం దివంగత తొడిమె నాగిరెడ్డి వర్ధంతి సందర్భంగా కుటుంబ సభ్యులు స్టడీ చైర్స్‌తోపాటు స్వీట్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్మాస్టర్ శ్రీనివాసరెడ్డి, తొడిమె నాగిరెడ్డి కుటుంబ సభ్యులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

రైతు దేశానికి వెన్నెముక

వైవీయూ : రైతు దేశానికి వెన్నెముక లాంటి వారని, వారు లేకపోతే ప్రజలకు తిండికూడా దొరకదని కడప ఎస్‌కేఆర్ అండ్ ఎస్‌కేఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వి. సలీంబాషా పేర్కొన్నారు. శనివారం నగరంలోని కళాశాలలో జాతీయ రైతుదినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాజీ ప్రధానమంత్రి చరణ్‌సింగ్ జయంతి సందర్భంగా జాతీయ రైతు దినోత్సవాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. ప్రధాని పదవిలో ఉన్న సమయంలో ఈయన రైతులకు మేలు చేసే చట్టాలను తీసుకువచ్చారని గుర్తుచేశారు. కార్యక్రమంలో అధ్యాపకులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపి వేత

పులివెందుల రూరల్ : పట్టణంలోని 11కె.వి. బెస్తవారిపల్లె ఫీడర్, 11 కె.వి. ఇండస్ట్రియల్ ఫీడర్ పరిధిలోని కడప రోడ్డు నుంచి గురుకుల పాఠశాల, మెడికల్ కళాశాల ప్రాంతాలలో కొత్తగా విద్యుత్‌లైన్ వేస్తున్న కారణంగా ఆదివారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ ఏఈ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. రైతులు, వినియోగదారులు ఈ విషయాన్ని గమనించి సహకరించాలన్నారు.

ఘనంగా వైకుంఠ ఏకాదశి వేడుకలు



కల్యాణాన్ని తిలకిస్తున్న భక్తులు



పులివెందులలో కల్యాణోత్సవంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీరంగనాథస్వామి

పులివెందుల టౌన్ : పట్టణంలోని శ్రీరంగనాథ స్వామి ఆలయంలో వైకుంఠ ద్వార దర్శనం, స్వామి వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా వేలాది మంది భక్తుల సమక్షంలో జరిగింది. పోటెత్తిన భక్తులతో రంగనాథస్వామి ఆలయ ఆవరణ నిండిపోయింది. అనంతరం గుప్తా మెడికల్ స్టోర్ యజమాని దినేష్ ఆధ్వర్యంలో వేలాది మంది భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల జెడ్పీటీసీ బయపురెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలు శ్రీరంగనాథస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించారు. ఈ కల్యాణోత్సవానికి ముఖ్య అతిథులుగా ఈశ్వరిదేవి పీఠాధిపతి శ్రీశ్రీశ్రీశివకుమార స్వాముల వారు, శ్రీబ్రహ్మ పాదం బ్రహ్మంగారి ఉపన్యాసకులు డాక్టర్ కృష్ణమాచారిలు పాల్గొన్నారు. వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని పట్టణంలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో భక్తులకు ఉత్తర ద్వార దర్శనం కల్పించారు. అనంతరం భక్తులకు ఆలయ నిర్వాహకులు తీర్థ ప్రసాదాలను అందించారు. వైకుంఠ ఏకాదశి కార్యక్రమాన్ని ఆలయ కమిటీ చైర్మన్ చింతకుంట సుధీకర్‌రెడ్డి, ఆలయ కమిటీ, ఆలయ ఈఓ రమణ, పాలక మండలి సభ్యులు, ఆలయ సిబ్బంది, లయోలా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ సిబ్బంది, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని గ్రామాల్లో వైకుంఠ ఏకాదశి వేడుకలు ఘనంగా నిర్వహించారు. శనివారం ఉదయం నుంచి నల్లపురెడ్డిపల్లె, కొత్తపల్లె, ఎర్రబల్లె, అచ్చివెల్లి, తుమ్మలపల్లె, కనంపల్లె, నల్లగొండువారిపల్లె, రాగిమానుపల్లె, రచ్చుమర్రిపల్లె గ్రామాల్లోని వెంకటేశ్వర స్వామి, రామాలయ, శివాలయాల్లో భక్తులు వైకుంఠ ఏకాదశి పూజలు నిర్వహించారు. స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు.

బండలాగుడు పోటీలకు విశేష స్పందన

పులివెందుల రూరల్ : మండల పరిధిలోని ఉలిమెల్ల, అచ్చివెల్లి గ్రామాల సమీపంలోని శ్రీలక్ష్మీవెంకటేశ్వరస్వామి ఆలయంలో శనివారం గ్రామస్తుల ఆధ్వర్యంలో నిర్వహించిన బండలాగుడు పోటీలను మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డిలు ప్రారంభించి గెలుపొందిన విజేతలకు బహుమతులను అందజేశారు.

వేములలో..

వేముల : వేములలోని శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ఏకాదశిని పురస్కరించుకుని భక్తులు వేకువ జామునుంచి ఆలయానికి చేరుకున్నారు. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు. ఉత్తర ద్వార దర్శన భాగ్యం కల్పించారు. అలాగే తిరుమల నాయుని గుట్టపై వెలసిన శ్రీమంజునాథేశ్వరస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి మొక్కులు తీర్చుకున్నారు.

వేంపల్లెలో..

వేంపల్లె : పట్టణంలోని పలు ఆలయాలలో స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు పోటెత్తారు. శనివారం నాలుగు రోడ్ల కూడలిలోని శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయం, మెయిన్ బజార్‌లోని వీరాంజనేయస్వామి ఆలయం, వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయాలలో శనివారం తెల్లవారుజామున 3 గంటల నుంచి మహిళలు, భక్తులు బారులు తీరారు. ఆయా ఆలయాల్లో ఉత్తర ద్వార దర్శనం ఏర్పాటు చేయడంవల్ల స్వామివారిని దర్శించుకునేందుకు భక్తులు క్యూలో నిలబడ్డారు. ఆలయ అర్చకులు హరిప్రవీణ్, ప్రసాద్ శర్మలు వెంకటేశ్వరస్వామి, శ్రీవృషభాచలేశ్వరస్వామి వార్లను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదాలను అందించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ శ్రీధర్, చైర్మన్ వెంకటేష్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు ఆర్.సురేంద్ర, పాలక మండలి సభ్యులు పాల్గొన్నారు.

వల్లూరు..

వల్లూరు : వైకుంఠ ఏకాదశి పర్వ దినాన్ని పురస్కరించుకుని పవిత్ర పుణ్య క్షేత్రమైన పుష్పగిరిలో కొలువైన శ్రీ చెన్నకేశవస్వామి ఉత్తర ద్వార దర్శనానికి శనివారం భక్తులు భారీగా తరలి వచ్చారు. ఆలయ ప్రధాన అర్చకులు అఖిల్ దీక్షితులు ఆధ్వర్యంలో తెల్లవారు జామున అలంకార ప్రియుడైన శ్రీలక్ష్మీ చెన్నకేశవ స్వామికి బిందె తీర్థ సేవ, విశేష ఆరాధన, ప్రాతఃకాల ఆరాధన, తులసి, బిల్వ పత్రార్చన నిర్వహించారు. అభిషేక ప్రియుడైన శివునికి అభిషేకాలను నిర్వహించారు. విష్ణు అంశయైన చెన్న కేశవునితో బాటు, సంతాన మల్లేశ్వరస్వామి, రాజ్యలక్ష్మిదేవి, ఆంజనేయస్వామి మూలవిరాట్‌లకు వివిధ రకాల పూలతో పూలంగి సేవను నిర్వహించడంతో భక్తులకు ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. పవిత్ర పెన్నా నదిలో స్నానాలు ఆచరించిన భక్తులు శ్రీ వెంకటేశ్వరస్వామి అలంకారంలో దర్శనమిచ్చిన శ్రీ చెన్నకేశవుని ఉత్తర ద్వారం ద్వారా దర్శనం చేసుకుని తరించారు. ఉదయం నుండి ఉత్తర ద్వారానికి ఎదురుగా గరుడవాహనంపై కొలువుదీరి భక్తులకు సుమనోహరంగా దర్శనమిచ్చిన స్వామివారి ఉత్సవమూర్తికి భక్తులు కాయ కర్పూరాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అన్న ప్రసాద వితరణ జరిగింది. సాయంత్రం కొండపై నుండి స్వామివారిని పల్లకిలో మోస్తూ మంగళవాయిద్యాలు, దివిటీల వెలుగుల మధ్య నది మీదుగా మోస్తూ గ్రామంలో గ్రామోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ రామచంద్రయ్య స్వామిని దర్శించుకున్నారు. కార్యక్రమంలో ఆలయ అనువంశిక ధర్మకర్త దుగ్గిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి, ఇన్‌చార్జ్ ఈవో శ్రీనివాసులు, సుబ్బారెడ్డి, పురావస్తు శాఖ సిబ్బంది వెంకట రత్నం పాల్గొన్నారు. అలాగే మండలంలోని పలు గ్రామాలలో వైకుంఠ ఏకాదశి పర్వ దిన్నాన్ని పురష్కరించుకుని శనివారం పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించారు. వల్లూరులోని శ్రీ భవానీ శంకర ఆలయంలో ఉత్తర ద్వార దర్శనం ద్వారా భక్తులు శ్రీ చెన్నకేశవస్వామిని దర్శించుకున్నారు. తూర్పు వీధి రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవి ఆలయంలో అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించారు. పెద్దపుత్తలోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయంలో ఆకు పూజలు నిర్వహించారు. శ్రీ యోగా రామాలయంలో అభిషేకాలను, ప్రత్యేక పూజలను నిర్వహించారు. రాత్రి తాళ భజన కార్యక్రమాలను నిర్వహించారు. పైడికాలువలోని శ్రీ రాజ్యలక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయంలో స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించారు. దిగువపల్లెలోని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి ప్రత్యేక పూజలను నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కుబడులు చెల్లించారు.

కమలాపురంలో..

కమలాపురం : మండలంలోని అన్ని గ్రామాల్లో ప్రజలు శనివారం వైకుంఠ ఏకాదశి వేడుకలను భక్తి శ్రద్ధలతో నిర్వహించుకున్నారు. భక్తులు తెల్లవారు జాము నుంచే ఉత్తర ద్వారం గుండా స్వాముల వారిని దర్శించుకున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిర్వాహకులు అన్ని ఏర్పాట్లు చేశారు. రామాపురంలో జరుగుతున్న నిత్య కల్యాణ మహోత్సవాల్లో భాగంగా మోక్ష నారాయణ, సుబ్రమణ్య స్వాముల వారి కల్యాణం నిర్వహించారు. కమలాపురంలో స్వాముల వారిని ప్రత్యేక వాహనంలో అలంకరించి పట్టణంలోని పుర వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఆలయాల్లో భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

వీరపునాయునిపల్లెలో..

వీరపునాయునిపల్లె : మండలంలోని ఉరుటూరు గ్రామంలో వెలసిన భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంట వాసుని కల్యాణం శనివారం ప్రధాన అర్యకులు ఉమామహేశ్వర శర్మ ఆధ్వర్యంలో వైభవంగా నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి స్వామిని దర్శించుకున్నారు. టీటీడీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నమయ్య సంకీర్తనలు, గ్రామస్తులను ఆకట్టుకున్నాయి.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : నారాపుర వెంకటేశ్వరస్వామి దర్శనం కోసం భక్తులు బారులు తీరారు. ఉత్తర ద్వారంలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. శనివారం తెల్లవారు జామునుంచే భారీగా భక్తులు దర్శనం కోసం నిలబడ్డారు. ఆర్టీసీ బస్టాండ్‌లో ఉన్న లక్ష్మీప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి వారికి ప్రత్యేక అభిషేక కార్యక్రమాలను నిర్వహించారు.

ఎర్రగుంట్లలో..

ఎర్రగుంట్ల : ఎర్రగుంట్ల, చిలంకూరులలో ఉన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో భక్తులు శనివారం తెల్లవారిజాము నుంచే ఉత్తర ద్వారం ద్వారా స్వామివారిని దర్శించుకున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో సుందర్య కాలనీలో ఉన్న ఆలయానికి ప్రైవేటు స్కూల్స్ కరస్పాండెట్లు స్వచ్ఛందంగా స్కూల్ బస్సులను ఏర్పాటు చేశారు. అలాగే మెమండలంలోని చిర్రాజుపల్లిలో ఉన్న శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయానికి శనివారం ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి వెళ్లి దర్శించుకున్నారు.

కొండాపురంలో..

కొండాపురం : మండలంలోని బెడుదూరు కొండ పైన ఉన్న వెంకటేశ్వరస్వామి దేవాలయం, తాళ్ళ ప్రొద్దుటూరులోని శ్రీలక్ష్మి చెన్నకేశవస్వామి దేవాలయాల్లో ఉత్తర ద్వారంలో భక్తులు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించారు. వచ్చిన భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు



పుష్పగిరిలో గరుడ వాహనంపై కొలువు దీరి గ్రామోత్సవంలో దర్శనమిస్తున్న చెన్నకేశవ స్వామి



జమ్మలమడుగులో క్యూకట్టిన భక్తులు



పుష్పగిరిలో ప్రత్యేక అలంకరణలో శ్రీ చెన్నకేశవ స్వామి మూల విరాట్



వేములలో ప్రత్యేక అలంకరణలో శ్రీవెంకటేశ్వరస్వామి




పులివెందుల : బండలాగుడు పోటీలను ప్రారంభిస్తున్న మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి



పులివెందులలో శ్రీవెంకటేశ్వరస్వామి, శ్రీరంగనాథస్వామి ఆలయాలలో ఉత్తర ద్వార దర్శనంలో భక్తులు



వేంపల్లెలో స్వామివారి దర్శనానికి క్యూలో నిలబడిన భక్తులు



పుష్పగిరిలో ఉత్తర ద్వార దర్శనానికి వచ్చిన భక్తులు

విద్యార్థులకు స్టీల్ వాటర్ బాటిళ్లు పంపిణీ



విద్యార్థులకు వాటర్ బాటిళ్లను పంపిణీ చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు

చక్రాయపేట : నాగలగుట్టపల్లె జడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులకు ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి పంపిన స్టీల్ వాటర్ బాటిళ్లను శనివారం పంపిణీ చేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా ఎంపీ తన సొంత నిధులతో 354 స్టీల్ వాటర్ బాటిళ్లను విద్యార్థులకు పంపించగా వీటిని జడ్పీటీసీ సభ్యుడు శివప్రసాదరెడ్డి, ఎంపీపీ మాధవీ బాలకృష్ణ, మండల సమన్వయ కర్త ఓబుళరెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, మండల ఉపాధ్యక్షుడు వేదమూర్తిలు విద్యార్థులకు పంపిణీ చేశారు. ఎంఈవో 2 రామచంద్రారెడ్డి, ప్రధానోపాధ్యాయుడు సంజీవకుమార్, రోటర్ వెంకటరమణ, తులసి, గంగయ్య, నాగేశ్వరరావు, సుధాకరరెడ్డి, రాజబాబు, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే డాక్టర్ ఎం.సుధీర్‌రెడ్డి

ఎర్రగుంట్ల : రాష్ట్రంలో అభివృద్ధి సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే డాక్టర్ ఎం. సుధీర్‌రెడ్డి తెలిపారు. శనివారం పట్టణంలోని 16వ వార్డులో మున్సిపల్ చైర్మన్ ఎం.హర్షవర్ధన్‌రెడ్డితో కలసి ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొని ఇంటింటికి వెళ్లి ప్రజల సమస్యలను తెలుసుకుని అక్కడే ఉన్న అధికారుల సమక్షంలో పరిష్కరించారు. ప్రజలకు ఏ చిన్న సమస్య వచ్చినా ముందుటానని ఎమ్మెల్యే వారికి భరోసా కల్పించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రజల కోసం సచివాలయం, ఆర్‌బీకే, హెల్త్ సెంటర్, డిజిటల్ లైబ్రరీలు నిర్మించారన్నారు. కార్యక్రమంలో పార్టీనాయకులు, వలంటీర్లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

చురుగ్గా సాగుతున్న ఆలయ నిర్మాణ పనులు



వీరపునాయునిపల్లె : మండలంలోని సంగాలపల్లె గ్రామం వద్ద నిర్మాణంలో ఉన్న శ్రీ సప్తగిరి లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ ఆలయ నిర్మాణ పనులకు సంబంధించి 2011లో భూమి పూజ చేశారు. దాతల సహాయ సహకారాలు సకాలంలో అందక పనులు ఆగిపోయాయి. ఈ విషయం గురించి ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. దీనిపై ప్రత్యేక దృష్టిపెట్టిన రవీంద్రనాథ్‌రెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే ఆలయ నిర్మాణ పనుల గురించి ఆయనకు వివరించారు. వెంటనే స్పందించిన ముఖ్యమంత్రి తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో శ్రీవాణి ట్రస్టు ద్వారా ఆలయ నిర్మాణానికి రూ.71 లక్షలు మంజూరు చేయించారు. 12 సంవత్సరాల పాటు ఆగిపోయిన ఆలయ నిర్మాణ పనులు ప్రస్తుతం పునఃప్రారంభమయ్యాయి. ఎమ్మెల్యే రవీంద్రనాథ్ రెడ్డికి ఆలయ కమిటీ సభ్యులు, మండల ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.

అధ్యాపక నియామకాలు చేపట్టాలి

కడప వైఎస్ఆర్ సర్కిల్ : డిగ్రీ అధ్యాపక ఉద్యోగాల నియామకాలు చేపట్టాలని ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి ద్రవిడ సురేష్ కోరారు. శనివారం రారా గ్రంథాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అధ్యాపక ఉద్యోగాలకు పోస్ట్ గ్రాడ్యుయేట్ (పీజీ)తోపాటు రాష్ట్ర అర్హత పరీక్ష ఏపీసెట్, లేదా జాతీయ అర్హత పరీక్ష (నెట్)లేదా పీహెచ్‌డీలు విద్యార్హతగా ఉన్నాయన్నారు. అయితే రాష్ట్ర ఉన్నత విద్యా మండలి ప్రతి సంవత్సరం అర్హత పరీక్ష (ఏపీసెట్) నిర్వహించాల్సి ఉన్నా నిర్వహించలేదన్నారు. వెంటనే సెట్ నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఏఐవైఎఫ్ నగర నాయకులు సంజయ్, నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

సింహాద్రిపురాన్ని సింగపూర్‌గా మార్చిన సీఎం



మీడియాతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి

సింహాద్రిపురం : మండలాన్ని దాదాపు రూ.200 కోట్లతో అభివృద్ధి చేసి సింగపూర్‌గా మార్చి అభివృద్ధి అంటే ఏమిటో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేసి చూపించారని వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. శనివారం సింహాద్రిపురంలో ఆయన వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి మీడియా సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో అనతికాలంలోనే 30 సంవత్సరాల అభివృద్ధి సింహాద్రిపురానికి చేయడం జరిగిందన్నారు. అలాగే ప్రతి పల్లె అభివృద్ధి చెందితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందన్న లక్ష్యంతో ప్రతి పల్లెల్లో సచివాలయంతోపాటు వ్యవసాయ రంగానికి మైక్రో ఇరిగేషన్, ప్రజలకు వైద్యం ఆర్థిక భారం కాకూడదని గ్రామాల్లో వైఎస్సార్ విలేజ్ క్లినిక్‌లు ఏర్పాటు చేసి రాష్ట్రాభివృద్ధికి పల్లెలే పట్టుకొమ్మలు అన్న నినాదంతో ప్రతి పల్లె రూపురేఖలను మార్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కుతుందన్నారు. అభివృద్ధి చేయడానికి సలహాలు ఇవ్వాలే తప్ప అభివృద్ధి కనిపిస్తున్నా కూడా అభివృద్ధి చేయలేదనడం ప్రతిపక్షాల అవివేకానికి నిదర్శనమన్నారు. ప్రతిపక్షాలకు వెన్నుపోటు తప్ప అభివృద్ధి అంటే ఏమిటో తెలియదన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకంతో చెరువుకు జలకళ

హర్షం వ్యక్తం చేస్తున్న రైతులు



లింగాల చెరువులో ఉన్న నీరు

లింగాల : లింగాల కుడికాలువపై ఏర్పాటు చేసిన ఎత్తిపోతల పథకం ద్వారా చెరువుకు నీటిని తరలిస్తుండటంతో చెరువు జలకళలాడుతోంది. రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాలతో కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి కృషితో లింగాల కుడికాలువ గట్టుపై భారీ ఎత్తిపోతల పథకాన్ని ఏర్పాటు చేశారు.

దీన్ని మే 17వ తేదీన కడప ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి ప్రారంభించారు. సుమారు 42 రోజుల పాటు నిరంతరాయంగా ఎత్తిపోతల పథకం మోటార్ల ద్వారా నీటిని తరలిస్తున్నారు. లింగాల చెరువుకు నీరు చేరడంతో లింగాల గ్రామ రైతులు, ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. దీంతో గ్రామంలోని వ్యవసాయ బోరుబావుల్లో భూగర్భజలాలు పెంపొందుతున్నాయని.. ఇందుకు సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి, ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డిలకు వారు కృతజ్ఞతలు తెలిపారు.

పంటలు సాగు చేస్తున్నాం.. :



ప్రస్తుతం పంటల సాగుకు ప్రతికూల వాతావరణం నెలకొంది. చెరువుకు నీరు నింపడంతో భూగర్భజలాలు పెంపొంది ధైర్యంగా పంటలు సాగు చేసుకోగలుగుతున్నాం.

– చెన్నకేశవులరెడ్డి(రైతు), లింగాల

తాగు, సాగునీటికి సమస్య లేదు :



లింగాల చెరువుకు ఎత్తిపోతల పథకం ద్వారా నీటిని నింపడంతో తాగు, సాగు నీటి సమస్య పరిష్కారమైంది. గత ప్రభుత్వ హయాంలో ఆ పార్టీ నేతలు దీక్షలు చేస్తే కానీ సాగునీరు, తాగునీరు అందలేదు. ప్రస్తుత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి చొరవతో రైతుల సమస్యలను తెలుసుకుని వాటిని పరిష్కరించడం హర్షించదగ్గ విషయం.

– చంద్రశేఖరరెడ్డి(రైతు), లింగాల

‘ఆడుదాం.. ఆంధ్ర’ను విజయవంతం చేద్దాం



పులివెందులలో 3కె రన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్



కమలాపురంలో విద్యార్థులతో పాటు యోగా చేస్తున్న వైఎస్సార్ సీపీ నాయకులు

పులివెందుల టౌన్ : ప్రతి ఒక్కరు ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్ తెలిపారు. శనివారం పట్టణంలోని గాంధీ సర్కిల్ వద్ద నుంచి వెంకటేశ్వరస్వామి ఆలయం వరకు ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా 3కె రన్ కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డితో కలిసి ఆయన జెండా ఊపి ప్రారంభించి మాట్లాడారు. ప్రతి ఒక్కరిలో క్రీడా స్ఫూర్తిని వెలికితీసేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందన్నారు. అందుకు ప్రతి ఒక్కరు తమకు నచ్చిన క్రీడలలో పాల్గొని బహుమతులు సాధించాలన్నారు. కార్యక్రమంలో సివిల్ సప్లయ్ రాష్ట్ర డైరెక్టర్ హాలు గంగాధరరెడ్డి, ఎంపీడీఓ వెంకటేష్, కౌన్సిలర్లు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల పీఈటీలు, సచివాలయ సెక్రటరీలు, వార్డు వలంటీరు పాల్గొన్నారు.

క్రీడల్లో రాణించడానికి ఏకాగ్రత ముఖ్యం

కమలాపురం : విద్యార్థులు విద్యతో పాటు క్రీడల్లో రాణించాలంటే ఏకాగ్రత ముఖ్యం అని హార్టికల్చర్ స్టేట్ అడ్వైజర్ సంబటూరు ప్రసాద్‌రెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఉత్తమారెడ్డి తెలిపారు. ఈ నెల 26వ తేదీ నుంచి జరగనున్న ఆడుదాం.. ఆంధ్రా క్రీడా పోటీలను పురస్కరించుకుని శనివారం స్థానిక గురుకుల పాఠశాలలో మండల స్పెషలాఫీసర్ నరసింహారెడ్డి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చలపతి, నగర కమిషనర్ రాముడుల పర్యవేక్షణలో విద్యార్థులతో యోగా చేయించారు. విద్యార్థుల్లో దాగి ఉన్న క్రీడా ప్రతిభను వెలికి తీసేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి గతంలో ఎన్నడూ లేని విధంగా ఆడుదాం.... ఆంధ్రా పోటీలను నిర్వహించడం హర్షణీయం అన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

క్రీడా సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలి

వేంపల్లె : క్రీడాకారులు క్రీడా సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని ఎంపీడీవో దివిజ సంపతి తెలిపారు. శనివారం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమంపై అవగాహన పెంచడానికి స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల ఆవరణలో 3కె రన్ మారథన్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం 15ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు ఉన్న వారికి ఆరోగ్యం, వ్యాయామం తదితర అంశాలపై అవగాహన పెంచడానికి ఈ కార్యక్రమాన్ని నిర్వహించినట్లు చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా గ్రామస్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు ఈనెల 26న ఆడుదాం.. ఆంధ్రా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. కబడ్డీ, ఖోఖో, క్రికెట్, బాల్ బ్యాడ్మింటన్, వాలీబాల్ తదితర పోటీలలో ఉత్సాహవంతులుగా ఉన్న 15 ఏళ్ల నుంచి 60 ఏళ్ల మధ్య వయస్సు గల వారు ఆయా సచివాలయాలలో తమ పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, సచివాలయ సిబ్బంది, సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చెన్నూరులో..

చెన్నూరు : స్థానిక శివాలయం గుడిలోని ఆడిటోరియంలో శనివారం యోగా మాస్టర్ శ్రీనివాసరాజు ఆధ్వర్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఆడుదాం ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా యోగ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ చీర్ల సురేష్‌యాదవ్, మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ జీఎన్ భాస్కర్‌రెడ్డి, ఎంపీడీఓ సుబ్రహ్మణ్యంశర్మలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువతీ యువకులు ఆయా గ్రామ సచివాలయాలలో పేర్లు నమోదు చేసుకుని ఆటల పోటీలలో పాల్గొనాలన్నారు. క్రికెట్, కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్ తదితర ఆటలు ప్రతి గ్రామ సచివాలయం పరిధిలో నిర్వహిస్తారన్నారు. గ్రామస్థాయి, మండల స్థాయి, నియోజకవర్గస్థాయి, జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయిలో పోటీలు జరుగుతాయని తెలిపారు. ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో కార్యదర్శి రామసుబ్బారెడ్డి, భరత్ రెడ్డి, యోగి, రాజు, ఎంఈఓలు, సచివాలయ సిబ్బంది, గ్రామ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

జమ్మలమడుగులో..

జమ్మలమడుగు : గ్రామీణ, పట్టణ ప్రాంతాలో నైపుణ్యం కలిగిన క్రీడాకారులను గుర్తించి వారిని వెలుగులోకి తీసుకురావడం ఆడుదాం ఆంధ్ర లక్ష్యమని మున్సిపల్ చైర్‌పర్సన్ వేల్పుల శివమ్మ తెలిపారు. శనివారం మున్సిపల్ కమిషనర్ జి.వెంకట్రామిరెడ్డి ఆధ్యక్షతన 3కె రన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ ఆమె మాట్లాడుతూ ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం ద్వారా క్రికెట్, వాలీబాల్, తదితర పోటీలను సచివాలయం పరిధిలో ఉన్న క్రీడాకారులతో నిర్వహిస్తారన్నారు. నైపుణ్యం కలిగిన క్రీడాకారులను ఎంపిక చేసి వారికి మరింత శిక్షణ ఇస్తే వారు మంచి క్రీడాకారులవుతారన్నారు. గతంలో ఏ ప్రభుత్వం చేపట్టని ఈ కార్యక్రమాలను నేడు వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేపడుతుందన్నారు. కార్యక్రమంలో ఎంఈఓ పరమేశ్వరయ్య, పతంగే రామన్నరావు ఉన్నత పాఠశాల విద్యార్థులు సిబ్బంది పాలల్గొన్నారు.

వల్లూరులో..

వల్లూరు : మండల పరిధిలోని గంగాయపల్లె ఏపీ మోడల్ స్కూల్ వద్ద నుంచి శనివారం ఎంపీడీవో జయశ్రీ ఆధ్వర్యంలో 3 కే రన్ మారథాన్ నిర్వహించారు. ఆడుదాం ఆంధ్ర అవగాహనా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన ఈ మారథాన్‌ను ప్రారంభించిన ఎంపీడీవో మాట్లాడుతూ ప్రభుత్వం గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజల్లో దాగి వున్న క్రీడా సామర్థ్యాలను గుర్తించి ప్రోత్సహించాలనే ధ్యేయంతో ఈనెల 26 నుంచి ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలను నిర్వహిస్తోందన్నారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఎంఈవో లిల్లెమ్మ, వ్యాయామ ఉపాధ్యాయులు తిరుపాల్ రెడ్డి, ఎంఆర్‌సీ సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



వేంపల్లెలో 3కె రన్ మారథన్ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎంపీడీఓ దివిజ సంపతి, తదితరులు



చెన్నూరులో యోగా చేస్తున్న విద్యార్థులు



జమ్మలమడుగులో ర్యాలీని ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ శివమ్మ

వీల్‌చైర్, వినికిడి యంత్రాల పంపిణీ



పరికరాలను అందుకున్న లబ్ధిదారులతో దాతలు

జమ్మలమడుగు : దీన జన సేవా సమితి ఆధ్వర్యంలో వికలాంగులకు, వయో వృద్ధులకు వినికిడి యంత్రాలు, వీల్ చైర్‌లతోపాటు వృద్ధులకు ఊత కర్రలను శనివారం మండల పరిధిలోని గూడెంచెరువు రాజీవ్ కాలనీలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఇండస్ట్రీయల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ మార్బల్ శ్రీను మాట్లాడుతూ దృష్టిలోపం, అంగవైకల్యం కలిగిన వారికి ఇటీవల పార్లమెంట్ సభ్యులు వైఎస్ అవినాష్‌రెడ్డి చేతుల మీదుగా దాదాపు రెండువేల మంది వికలాంగులకు వారికి అవసరమైన పరికరాలను పంపిణీ చేశారు. అయితే సేవా సంస్థలు కూడా ముందుకు వచ్చి వృద్ధులకు ఊతకర్రలు, వీల్ చైర్లు పంపిణీ చేయడం శుభ పరిణామమన్నారు. అనంతరం పరికరాలను పంపిణీ చేశారు.

కరపత్రాల ఆవిష్కరణ

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరంలోని కళాక్షేత్రంలో జనవరి 17వ తేదీన నిర్వహించే శ్రీకృష్ణ దేవరాయలు జయంతి కార్యక్రమంలో బలిజ సామాజిక వర్గీయులంతా పాల్గొని జయప్రదం చేయాలని కాపునాడు నాయకులు పిలుపునిచ్చారు. శనివారం కడప నగరంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కాపునాడు నాయకుడు శ్రీకృష్ణ దేవరాయలు జయంతికి సంబంధించి కరపత్రాలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాపు నాడు రాష్ట్ర అధ్యక్షులు నారాయణ స్వామి రాయల్, పారిశ్రామికవేత్త అమరప్ప, బలిజ సంక్షేమ సంఘం కాపు నాడు జిల్లా అధ్యక్షులు సగినాల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

కుదేలైన మినుము రైతు



మినుము పంటను కోస్తున్న కూలీలు



అమ్మకానికి సిద్ధంగా ఉన్న మినుములు

పెద్దముడియం : మినుము పంటను సాగు చేసిన రైతులు దిగుబడి లేక తీవ్ర నష్టాల పాలయ్యారు. ఖరీఫ్‌లో కురిసిన కొద్దిపాటి వర్షానికి మండలంలో దాదా పు 1000 ఎకరాల మినుము పంటను సాగు చేశారు. కానీ తీవ్ర వర్షాభావ పరిస్థిలు వల్ల దిగుబడి రాక రైతు లు ఆర్థికంగా కుదేలయ్యారు. ప్రస్తుతం ముమ్మరంగా మినుము పంట కోతలు జరుగుతుండగా ఎకరాకు ఒకటి లేదా రెండు క్వింటాళ్ల దిగుబడి మాత్రమే వస్తోంది. ఎకరాకు దాదాపు రూ.25 వేల పెట్టుబడి పెట్టా మని కనీసం పెట్టుబడులు కూడా రాలేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వైకుంఠవాసా... శ్రీ వెంకటేశా..



గరుడ వాహనునిగా దర్శనమిస్తున్న వైకుంఠ వాసుడు

కడప కల్చరల్ : ముక్కోటి (వైకుంఠ) ఏకాదశి పర్వదినాన్ని ప్రజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శనివారం ప్రజలు భక్తిశ్రద్ధలతో విశేష పూజలు నిర్వహించారు. దాదాపు జిల్లాలోని అన్ని వైష్ణవాలయాలలో ఉదయం 5 గంటల నుంచి భక్తులను దర్శనానికి అనుమతించారు. ప్రతి ఆలయంలో వైకుంఠ ద్వారాన్ని విశేషంగా అలంకరించి స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులను కొలువుదీర్చారు. వైకుంఠ (ఉత్తర) ద్వారం లేని ఆలయాలలో ప్రత్యేకంగా అలాంటి ద్వారం సెట్టింగ్ వేసి అందులో నుంచి భక్తులకు స్వామి దర్శనభాగ్యం కల్పించారు. జిల్లాలోని ప్రముఖ వైష్ణవాలయం దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయంలో వైకుంఠ ద్వారాన్ని రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉదయం 5 గంటల నుంచి దర్శనానికి అనుమతించినా తెల్లవారుజాము 3 గంటల నుంచే భక్తులు వైకుంఠ ద్వారం వద్ద దర్శనం కోసం వేచి ఉన్నారు. స్వామి ఆలయం నుంచి పాతకడప రోడ్డులోని శివాలయం వరకు క్యూలో వేచి ఉండి మరీ దర్శనం చేసుకున్నారు. ఆలయంలో మూలమూర్తిని దర్శించేందుకు కూడా భక్తులు పెద్ద ఎత్తున బారులు తీరి వేచి ఉన్నారు.

■ కడప నగరం గడ్డిబజారులోని శ్రీ లక్ష్మిసత్యనారాయణ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు విజయ్‌భట్టర్ ఆధ్వర్యంలో హోమం, విశేష పూజలు నిర్వహించారు. జయనగర్ కాలనీలోని శ్రీదేవి, భూదేవి సమేత కల్యాణ వెంకటేశ్వరస్వామి ఆలయం, బీకేఎం వీధిలోని శ్రీ కోదండరామస్వామి ఆలయాలలోభక్తులు దైవ దర్శనం చేసుకున్నారు.

క్రిస్మస్‌కు ముస్తాబైన చర్చిలు



విద్యుత్‌దీప కాంతులతో ముస్తాబైన పులివెందుల సీఎస్ఐ చర్చి

పులివెందుల రూరల్ : ఈనెల 25వ తేదీన క్రిస్మస్ పండుగను పురస్కరించుకుని పులివెందుల పట్టణంలోని సీఎస్ఐ చర్చితోపాటు పలు ప్రాంతాలలో ఉన్న చర్చిలు, మండల పరిధిలోని గ్రామాల్లో ఉన్న చర్చిలు క్రిస్మస్ పండుగ వేడుకలకు ముస్తాబయ్యాయి. క్రిస్మస్ పండుగను క్రిష్టియన్ సోదరులు ఎంతో ఘనంగా జరుపుకుంటారు. ఈ సందర్భంగా క్రైస్తవ సోదరులు చర్చిలను విద్యుత్ దీపాలతోనూ, క్రిస్మస్ స్టార్లతోనూ ఎంతో సుందరంగా తీర్చిదిద్దారు. పట్టణంలోని పలు ప్రాంతాలతోపాటు ప్రతి గ్రామంలోని చర్చిలలో క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహిస్తారు.

ఎల్ఐసీలో రిక్రూట్ మెంట్ వెంటనే చేపట్టాలి

జమ్మలమడుగు : జీవిత బీమా సంస్థలో గత కొన్నిసంవత్సరాలు రిక్రూట్‌మెంట్ చేయకపోవడంతో చాలా ఖాళీలు ఎర్పడ్డాయి. వాటిని వెంటనే భర్తీ చేయటానికి రిక్రూట్ మెంట్ నిర్వహించాలని ఆల్ ఇండియా ఇన్సూరెషన్ ఎంప్లాయిస్ ఆసోసియేషన్ శనివారం స్థానిక కార్యాలయంలో ధర్నా నిర్వహించారు. జీవితా బీమా సంస్థ ఉద్యోగుల సంఘ నాయకులు ఆదినారాయణ, కల్యాణ్, వెంకట్రామిరెడ్డిలు మాట్లాడుతూ జీవిత బీమా సంస్థలో రిటైర్డు అయ్యేవారు ఎక్కువగా ఉన్నారని భవిష్యత్తులో పనిచేసేవారికి ఎక్కువ పని భారం పడుతుంది కాబట్టి సంస్థ వెంటనే ఉద్యోగులను నియమించాలన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన కొత్త పెన్షన్ స్కీంలో కేవలం జీతంలో పదిశాతం మేరకు కటింగ్ చేస్తున్నారని దానిని 14 శాతానికి పెంచాలన్నారు. కార్యక్రమంలో ఎన్ఎఫ్ఐ, ఎఫ్‌డబ్ల్యూ క్లాస్ వన్ యూనియన్ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

భగవద్గీతను పఠించాలి



జిల్లా స్థాయి భగవద్గీత పోటీల్లో గెలుపొందిన విద్యార్థులు

ప్రొద్దుటూరు కల్చరల్ : భగవద్గీతను ప్రతి ఒక్కరూ పఠించాలని శివదర్శనానంద సరస్వతి మాతాజీ పేర్కొన్నారు. స్థానిక గోల్డెన్ పార్కులో శనివారం రాత్రి గీతాజయంతి సందర్భంగా జిల్లా స్థాయి భగవద్గీత పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ భగవద్గీతను చదవడం వలన మంచి చెడు విచక్షణ జ్ఞానం తెలుస్తుందన్నారు. భగవద్గీత పఠన పోటీల్లో పదివేల మంది విద్యార్థులు పాల్గొన్నారని తెలిపారు. నిర్వాహకుడు పల్లేటి ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ పట్టణంలో 29 స్కూళ్లకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారని తెలిపారు. జిల్లా స్థాయిలో 200 మంది విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశామన్నారు. భగవద్గీత గొప్పతనాన్ని వివరించారు. కార్యక్రమంలో డాక్టర్ విజయేశ్వరి, డాక్టర్ రామమునిరెడ్డి, గీతాంజలి హైస్కూల్ కరస్పాండెంట్ శివరామిరెడ్డి, రవీంద్ర హైస్కూల్ కరస్పాండెంట్ విష్ణు కుమార్‌రెడ్డి, రిటైర్డు ప్రిన్సిపాల్ కళావతి, పలు పాఠశాలల యాజమాన్యాలు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. స్థానిక ఇస్కాన్ కేంద్రంలో గీతా జయంతి సందర్భంగా భగవద్గీత పఠనం జరిగింది.

పన్నులు చెల్లించి అభివృద్ధికి సహకరించండి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్

పులివెందుల టౌన్ : వచ్చే ఏడాది మున్సిపాలిటీ బడ్జెట్ అంచనా వ్యయం రూ.12 కోట్లకుపైనే అని అంచనా వేశామని... ప్రస్తుతం పట్టణ విస్తీర్ణం పెరిగిన నేపథ్యంలో ఇంకా బడ్జెట్ వ్యయం పెరిగే అవకాశం ఉందని మున్సిపల్ చైర్మన్ వరప్రసాద్, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డిలు తెలిపారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాలులో మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి ఆధ్వర్యంలో సాధారణ బడ్జెట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడ్జెట్ అంచనా వ్యయం మరింత పెరిగే అవకాశం ఉందని ప్రజలు పన్నులు సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలన్నారు. అలాగే జగనన్న ఆరోగ్య సురక్ష, విద్యుత్ ఆదా, ఆడుదాం ఆంధ్రా కార్యక్రమం తదితర అంశాలపై చర్చించారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి ఒక్కరూ ముందుండి రాష్ట్రస్థాయిలో బహుమతులు సాధించేలా కృషి చేయాలన్నారు. అలాగే పులివెందుల మోడల్ టౌన్, సెంట్రల్ బోలేవార్డు, సిటీ సెంట్రం, గరండాల్ బ్రిడ్జి, వంక సుందరీకరణ, ఉలిమెల్ల చెరువు తదితర అభివృద్ధి పనులు పూర్తయితే వాటి స్థానంలో నీరు, విద్యుత్ ఆదా చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. మున్సిపాలిటీ ఆదాయం పెరిగేందుకు తీసుకోవాల్సిన వాటిపై చర్చించారు. పన్నులు సకాలంలో చెల్లించేలా సిబ్బంది ఒత్తిడి తీసుకరావాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ హాఫీజ్, కౌన్సిలర్లు, కో ఆప్షన్ మెంబర్లు, మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు విద్యార్థుల ఎంపిక


ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు, పీడీ, తది తరులు

వేంపల్లె : సబ్ జూనియర్స్ హ్యాండ్‌బాల్ ఆసోసియేషన్ రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలకు వేంపల్లె జెడ్పీ బాలుర ఉన్నత పాఠశాల విద్యార్థులు ఎంపికైనట్లు ఆ పాఠశాల పీడీ రాజశేఖర్ తెలిపారు. శనివారం ఆ పాఠశాలలో ఇన్‌చార్జి హెచ్‌ఎం రామచంద్రారెడ్డి, ఉపాధ్యాయులు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. ప్రతిభ చూపిన ఆదిశేషారెడ్డి, వెంకట శ్రీరాం, విష్ణువర్ధన్, పునేష్‌కుమార్, నాగేష్, సాయి అనే విద్యార్థులు ఈనెల 24, 25వ తేదీలలో గుంటూరు జిల్లా తెనాలిలో జరిగే రాష్ట్రస్థాయి హ్యాండ్‌బాల్ పోటీలలో పాల్గొంటారన్నారు. వీరి ప్రతిభ పట్ల ఉపాధ్యాయులతోపాటు పీడీలు హర్షం వ్యక్తం చేసి జిల్లా హ్యాండ్‌బాల్ ఆసోసియేషన్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

ముందస్తు క్రిస్మస్ వేడుకలు

వేంపల్లె : స్థానిక శ్రీచైతన్య ఉన్నత పాఠశాలలో శనివారం ముందస్తు క్రిస్మస్ వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు ఆ పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణి రెడ్డి తెలిపారు. పాఠశాల ఆవరణలో పూరిపాక ఏర్పాటు చేసి చిన్నారులు క్రిస్మస్ తాత వేషధారణలతో అందరిని అలరించారు. చిన్నారుల నృత్య ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. పాఠశాల కరస్పాండెంట్ బి.చక్రపాణిరెడ్డి మాట్లాడుతూ క్రైస్తవులందరికి ముందస్తు క్రిస్మస్ పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో ఎండీలు చేతన్‌రెడ్డి, చైతన్యారెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.


సెమీ క్రిస్మస్ పండుగ వేడుకలలో శ్రీచైతన్య పాఠశాల విద్యార్థులు

పేద వర్గాల్లో రాజకీయ చైతన్యం కలిగించండి

కమలాపురం : పేద, అణగారిన వర్గాల్లో రాజకీయ చైతన్యం కలిగించాలని లీగల్ అడ్వైజర్, ప్రభుత్వ న్యాయవాది (పీపీ) రవీంద్రప్రసాద్ తెలిపారు. శనివారం స్థానిక తహసీల్దార్ కార్యాలయ సముదాయం ఎదుట నూతనంగా ఏర్పాటు చేసిన మహాజన రాష్ట్ర సమితి (ఎంఆర్‌ఎస్) జిల్లా కార్యాలయాన్ని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద, అణగారిన వర్గాల్లో రాజకీయ చైతన్యం కలిగించాలని ఎంఆర్‌ఎస్ రాష్ట్ర అధ్యక్షుడు చంద్రశేఖర్‌కు సూచించారు. కార్యక్రమంలో ఎంఆర్‌ఎస్ జిల్లా, రాష్ట్ర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.